గందె సాంబయ్యకు ప్రముఖుల నివాళి

గందె సాంబయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 29: మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ మామయ్య గందె సాంబయ్య వర్ధంతి గురువారం నిర్వహించగా నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై సాంబయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ తో పాటు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు హాజరై నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన హుజూరాబాద్, జమ్మికుంట ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు హాజరయ్యారు.

సేఫ్టీమోకుపై గీత కార్మికులకు శిక్షణ

గోపాల్‌రావుపేట తాటివనంలో రక్షణ కవచంపై గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

రామడుగు, ఆగస్టు 29 : గోపాల్‌రావుపేట రేణుకా ఎల్లమ్మ ఆలయ సమీపంలోని తాటివనంలో గురువారం గోపాల్‌రావుపేట, తిర్మలాపూర్ గ్రామాల గీత కార్మికులకు కరీంనగర్ జిల్లా మద్య నిషేధిత అధికారి శ్రీనివాస్‌రావు సూచనల మేరకు ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మోకు) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాక్, మౌంటేన్ క్లైంబింగ్‌లో నిష్ణాతులైన శిక్షకుల ద్వారా సేఫ్టీమోకు ఉపయోగించే విధానం, మెలకువలు నేర్పించారు. సుమారు 40మంది గీత కార్మికులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ భూమయ్యగౌడ్, కానిస్టేబుల్ అనిల్‌కుమార్, పర్వతారోహణ శిక్షకుడు రాజు, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు సుద్దాల మల్లేశం, డైరెక్టర్లు బుచ్చిరాములు, అంజయ్య, తిరుపతి, లచ్చయ్య, గంగయ్య, వీరేశం, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లోన్ యాప్ డబ్బులు చెల్లించలేక

- ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

రాంనగర్ ఆగస్టు 29: వ్యాపారం సరిగా నడువక లోన్ తీసుకున్న డబ్బులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్ వాసి గూడ సతీశ్ రెడ్డి (43) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన సతీశ్ రెడ్డి పదిహేళ్లుగా వివిధ బ్యాంకుల నుంచి కార్లకు లోన్లు ఇప్పించే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. జ్యోతి నగర్‌లో షట్టర్ అద్దెకి తీసుకొని వ్యాపారం నిర్వహిస్తున్న సతీశ్ రెడ్డి కార్లు కొనుగోలు చేసే కస్టమర్లకు లోన్లు ఇప్పించడమే కాక తన అవసరాల కోసం లోన్ యాప్‌ల నుంచి డబ్బులు రుణంగా తీసుకున్నాడు. కస్టమర్లు వాయిదాలు చెల్లించకపోవడంతో వాటిని సర్దుబాటు చేసేందుకు సతీశ్ రెడ్డి రుణాలు తీసుకున్నాడు. వాటిని చెల్లించలేక మనస్తాపంతో గురువారం ఆఫీసులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆఫీసులో పనిచేసే ప్రసాద్ సాయికృష్ణ గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. క్రీడా రంగంలో ధ్యాన్ చంద్ ప్రతిభను కొనియాడారు. పలుచోట్ల 2కే రన్ నిర్వహించగా పోలీసులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్ : బిర్లా స్కూల్‌లో ఫుట్‌బాల్ ఆట ఆడుతున్న విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 29: బిర్లా స్కూల్‌లో పరుగుపందాలు, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం, ఆగస్టు 29: తాడికల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ రవి జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. ఇక్కడ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొరిమి మాధవి, తదితరులున్నారు.

చొప్పదండి, ఆగస్టు 29: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారమిత గ్రూప్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయుడు ఇనుగంటి ప్రసాదరావు విద్యార్థులకు స్పోర్ట్స్ షర్ట్స్ బహూకరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ నేషనల్ ప్లేయర్ శ్రీహరికి రూ.2500 బహుమానం అందజేశారు. ఆర్న కొండ వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను ఇక్కడ హెచ్ఎం రాజిరెడ్డి, సిబ్బంది సన్మానించారు.

గంగాధర, ఆగస్టు 29 : మండలంలోని గర్శకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల, సరస్వతి విద్యాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి బహుతులు అందజేశారు.

హుజూరాబాద్ టౌన్,ఆగస్టు 29 :పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు 1కే రన్ నిర్వహించారు. రన్‌ను పట్టణ సీఐ తిరుమల్ క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఇక్కడ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల గోవర్ధన్, పాఠశాల ప్రిన్సిపల్ గీతాషాజు, డైరెక్టర్స్ షాజు తామస్, గండ్ర సుధాకర్ రెడ్డి, నూకల శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజిరెడ్డి, సొల్లు సారయ్య, వాకర్ సభ్యులున్నారు.

సైదాపూర్, ఆగస్టు 29 : మండలంలోని సోమారం మోడల్ స్కూల్‌లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఇక్కడ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి శిరీష, పీడీ ఉయ్యాల విష్ణువర్ధన్ తదితరులున్నారు.

తిమ్మాపూర రూరల్, ఆగస్టు 29: మన్నెంపల్లి జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు ఆధ్వర్యంలో 2 కే రన్ నిర్వహించారు. ఎంపీడీవో విజయ్ కుమార్ రన్‌ను ప్రారంభించారు. హెచ్ఎం తన సొంత ఖర్చులతో విద్యార్థులకు మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఇక్కడ నాయకులు మేడి అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, తదితరులున్నారు.

కొత్తపల్లి, ఆగస్టు 29 : మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులకు 15 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఆండాళ్, పీఈటీ అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు రజిత, సదయ్య, వినోద్, జగదీశ్వరచారి, నలమాచి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర రూరల్: విద్యార్థులకు మెడల్స్ అందజేసిన ప్రధానోపాధ్యాయులు

చొప్పదండి: విద్యార్థులకు స్పోర్ట్స్ షర్ట్స్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు

పారమితలో క్రీడాదినోత్సవం

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు బాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పారమిత విద్యా సంస్థల అధినేత డాక్టర్ ప్రసాదరావు మైదానంలో చమటోడ్చిన విద్యార్థులే చదువులో కూడా ముందుంటారని, విద్యార్థులంతా తమకు ఇష్టమైన ఆటలో రాణించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వీయూఎం ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవితాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో కారు బీభత్సం

అతివేగంతో ఇంటిముందు నిలిపిన కారుపైకి దూసుకొచ్చిన మరో కారు

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 29: హుజూరాబాద్‌లో కారు బీభత్సం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో కరీంనగర్ ప్రధాన రహదారిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మూలమలుపు వద్ద అతివేగంతో వచ్చి అదుపుతప్పి రోడ్డుపక్కన ఇంటికి ఉన్న ఇనుపమెట్లను ఢీకొట్టి, ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారుపై ఎగిరి పడింది. కారులో ఉన్న ముగ్గురు యువకులు మద్యం మత్తులో ఉండడం వల్లే కారు అదుపు తప్పినట్లు తెలుస్తుండగా, ఘటనలో వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు దవాఖానకు తరలించారు. కారు బీభత్సంతో ఆస్తి ధ్వంసం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాగులో వ్యర్థాలు వేస్తే రూ.10 వేల జరిమానా

మటన్, చికెన్ సెంటర్ నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో క్రిష్ణప్రసాద్

శంకరపట్నం, ఆగస్టు 29: జంతు సంబంధ వ్యర్థాలు, కళేబరాలను కేశవపట్నం వాగులో వేస్తే జరిమానా విధిస్తామని ఎంపీడీవో క్రిష్ణప్రసాద్ హెచ్చరించారు. గురువారం కేశవపట్నం పంచాయతీ కార్యాలయంలో మండల కేంద్రంలో నిర్వహించే చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికెన్, మటన్, వ్యర్థాలతోపాటు జంతు కళేబరాలను కేశవపట్నం వాగులో పడవేయడం వల్ల వాగుతోపాటు ముత్తారం రామసముద్రం చెరువు, కల్వల ప్రాజెక్టు, తదితర గొలుసుకట్టు జలవనరులు కలుషితమై నీరు గరళంగా మారుతోందన్నారు. ఇప్పటికీ వాగులో వ్యర్థాలను వేసి కలుషితం చేసే చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులతోపాటు ఎవరైనా చెత్తా చెదారం వేసినా రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇక్కడ ఎంపీవో ప్రభాకర్, కార్యదర్శి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 29 : క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం స్టంప్స్ బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, యువత చెడు మార్గంలో పయణించకుండా క్రీడల పట్ల ఆసక్తిని కనబరచాలని కోరారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

శంకరపట్నం, ఆగస్టు 29: మండలంలోని కన్నాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్బీఎస్‌కే వైద్యాధికారులు సరిత, అక్షయ్, ఆప్తాల్మిక్ అధికారి డాక్టర్ జలంధర్ ఆధ్వర్యంలో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించారు. అనంతరం మందులను ఉచితంగా అందజేశారు. ఇక్కడ హెచ్ఎం గుజ్జుల జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

సైదాపూర్, ఆగస్టు 29 : రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పాస్‌బుక్ ఉన్న వారికి రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కోరారు.

బాలికల జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 29: చింతకుంటలోని సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు. ఎంఈసీలో ఎస్సీ 23, ఎస్టీ 2, బీసీ 4, ఎస్సీ సీ-1 మైనార్టీ1. సీఈసీలో ఎస్టీ-2, బీసీ1, ఎస్సీ సీ 1, ఓసీ1 మైనార్టీ1 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన బాలికలు తమ సర్టిఫికెట్లతో రావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పంట నమోదు పరిశీలన

కరీంనగర్ రూరల్, ఆగస్టు 29: కరీంనగర్ మండలంలోని నగునూర్ గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని గురువారం ఏడీఏ రణధీర్ పరిశీలించారు. నగునూర్ గ్రామంలోని పంటల వివరాలను సేకరించారు. రైతుల వారీగా పేర్లను సేకరించారు. సన్న, దొడ్డు రకం వరి పండగాల వివరాలు సేకరించారు. ఇక్కడ వీఈవో రైతులున్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన

శంకరపట్నం, ఆగస్టు 29: మండలంలోని మెట్‌పల్లి ఆయూష్మాన్ ఆరోగ్య మందిర్‌ను గురువారం హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందూ నాయక్ సందర్శించారు. ఎంఎల్‌హెచ్‌పీ మనోచిత్రను సెషన్స్, రోగులు, నిల్వ ఉన్న మందులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఇక్కడ వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యా సామగ్రి వితరణ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 29: కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ గ్రేడ్ తెలుగు పండిత్ ఉపాధ్యాయురాలు సందుగుల శ్రీదేవి విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ చేశారు. గురువారం పాఠశాలలోని విద్యార్థులకు విద్యా రూ.15 వేలతో అందించడం అభినందనీయమన్నారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలు కరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

నేడు ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మానకొండూర్, ఆగస్టు 29 : మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి ఒక ప్రకటనలో తెలిపారు.

రెండో రోజూ విచారణ

శంకరపట్నం, ఆగస్టు 29: మహిళ నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి వ్యవసాయ భూమిని అక్రమ విరాసత్ చేసుకుందనే వృద్ధురాలి ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు రెండోరోజూ విచారణ చేశారు. గురువారం తహసీల్ కార్యాలయంలో జమున, ఆమె కూతుళ్లు సుప్రజ, అక్షితను విచారించారు. ఇక్కడ గిర్దావర్లు ప్రత్యూష, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బాలసదన్ సందర్శన

కలెక్టరేట్, ఆగస్టు 29 : నగరంలోని బాలసదన్, శిశు గృహాలను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేశ్ గురువారం సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించి, వారి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ఆహార పదార్థాల నిల్వ గదిని తనిఖీ చేశారు. పరిశుభ్రమైన ఆహార పదార్థాలు చిన్నారులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో 1098 కో ఆర్డినేటర్ ఆవుల సంపత్, ఐసీపీఎస్ శాంత, శిశుగృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల మేనిఫెస్టో అమలెప్పుడు?'

కలెక్టరేట్, ఆగస్టు 29 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసేదెప్పుడో చెప్పాలని, తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టెకోల రాములు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో మాట్లాడుతూ, చెప్పేదొకటి, చేసేదొకటి అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు మేనిఫెస్టోలో పొందుపరిచి, అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు రాయమల్లు, వెదిర మల్లయ్య, బీ వెంకటమల్లయ్య, తైదల రామేశం, మన్నె లక్ష్మణ్, రాయికుంట మనోహర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

దుర్శేడ్‌లో వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, ఆగస్టు 29: దుర్శేడ్‌లో విషజ్వరాలపై చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో గల ఎల్లమ్మ ఆలయం వద్ద దుర్శేడ్ హెల్త్ సెంటర్ ఆధికారి డాక్టర్ శోభ ఆధ్వర్యంగా గ్రామంలో ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది గ్రామంలో 52 మందికి పరీక్షలు చేశారు. 15 మందికి, డెంగ్యూ, మలేరియా రక్తపరీక్షలు నిర్వహించారు. ఇక్కడ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, కార్యదర్శి సంజీవరెడ్డి, కారోబార్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

దురలవాట్ల నిర్మూలన ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణ చౌక్, ఆగస్టు 29: సమాజంలోని సామాజిక రుగ్మతలను నివారణకు జమాత్ ఏ ఇస్లామీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 13 వరకు చేపడుతున్న దురలవాట్ల నిర్మూలన ఉద్యమం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంస్థ జిల్లా అధ్యక్షుడు సొహైబ్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందులో భాగంగా ఉల్మా మీట్, స్కూల్ సందర్శన, ప్రభుత్వ అధికారులతో సమావేశం, తేనీటి విందు, బైక్ ర్యాలీలను నిర్వహిస్తామని తెలిపారు. మద్య, ధూమపానం, మాదక ద్రవ్యాల వ్యసనం పర్యవసానాలపై అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నాయకులు మహమ్మద్ అజహరుద్దీన్, మహమ్మద్ ఖైర్‌ఉద్దీన్, నయీమ్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యా సంస్థలపై విచారణ జరిపించాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 29: శ్రీచైతన్య విద్యా సంస్థల్లో ఫీజు దోపిడీపై ఈడీ, సీబీఐ సంస్థలతో దర్యాప్తు జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో గురువారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నగరంలో విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫీజు దోపిడీపై పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించిన పీడీఎస్‌యూ నాయకులపై విద్యా సంస్థ నిర్వాహకులు దాడి చేయడమే కాకుండా తొమ్మిది మందిపై కేసులు పెట్టించారని ఆరోపించారు. అనుమతి లేని పాఠశాల మీద జిల్లా అధికారుల ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు రవితేజ, నాయకులు బాబు, రాకేశ్, రోహిత్, సాద్విక్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కలెక్టరేట్, ఆగస్టు 29 : రాబోయే పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పంచాయతీలో ఓటర్ల వివరాలు సరిచూసుకోవాలన్నారు. సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ఒక కుటుంబంలోని ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలోని ఒకే వార్డులో ఉండేలా ఓటరు మెర్జింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్, డీపీవో రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

తెలంగాణ చౌక్, ఆగస్టు 29: ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన ఎమిమిది మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు జిల్లా ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దె రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు యూనియన్ నాయకులు గురువారం పరామర్శించి, కుటుంబానికి 50 కిలో బియ్యం చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకంతో ఆటోడ్రైవర్లు కిరాయిలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆత్మహత్యలకు పాల్పడిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ పటేల్, ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శులు మహేందర్, సత్యనారాయణ, నాయకులు రమేశ్, సంపత్, శ్రీనివాస్ ఉన్నారు.

పెన్షన్ విద్రోహదినాన్ని విజయవంతం చేయండి

గన్నేరువరం, ఆగస్టు29: సెప్టెంబర్ 1న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన ప్రదర్శనలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ కోరారు. గుండ్లపల్లిలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు.

ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

వీణవంక, ఆగస్టు 29: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీగణపతి ఫంక్షన్ హాల్‌లో గురువారం మండలాధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసిస్తలేరని తెలిపారు. ఇక్కడ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరేశ్, నాయకులు పెద్ది మల్లారెడ్డి, రవీందర్, వీరస్వామి, సమ్మయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, తదితరులున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

శంకరపట్నం, ఆగస్టు 29: సైబర్ నేరాలపై కేశవపట్నం పోలీసులు మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ సుధాకర్ సైబర్ నేరాల తీరు, తల్లిదండ్రులు, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇక్కడ స్కూల్ హెచ్ఎం కంకణాల నీరజ, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులున్నారు.

అట్టహాసంగా మండల స్థాయి క్రీడాపోటీలు

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 29: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడోత్సవాలను పట్టణ సీఐ తిరుమల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పిల్లలను అన్ని రకాల క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. గురువారం నుంచి శనివారం వరకు మండలస్థాయి క్రీడోత్సవాలు జరుగుతాయని ఎస్జీఎఫ్ కార్యదర్శి సొల్లు సారయ్య తెలిపారు. 14నుంచి 17సంవత్సరాల్లోపు విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాళ్లపెల్లి శ